



# కరపత్రం

SINCE 2014

శనివారం జూన్ 06, 2026 | సంపుటి : 2 | సంచిక : 235 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## మీ పదేళ్ల పాలన....
# నా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దామా

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి

- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- ఎంపిగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్దరణెలి మా లక్ష్యం
- జడ్చర్ల సభలో కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్



**జడ్చర్ల,జూన్ 5 :**
నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్ళుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెలి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు.



## సంస్కృతి సాంప్రదాయాలను
# విశ్వవ్యాప్తం చేసిన చేనేత

- థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభం
- 7వ తేదీ వరకు కొనసాగనున్న చేనేత ప్రదర్శన.
- పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2లో..

**హైదరాబాద్,జూన్5 :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు రూ.1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు.



## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

- అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు
- సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు

**న్యూఢిల్లీ,జూన్5 :**
దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్ల పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు

2 లో



## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్,జూన్5 :**
కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.

## క్యూర్ పరిధిలో
# లక్ష ఇళ్ల నిర్మాణం

» ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి



2 లో

**హైదరాబాద్,జూన్5 :**
కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు.

## నిధులు,నియామకాలు,
# నీళ్లలో వైఫల్యం

- బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు




**మహబూబాబాద్,జూన్5 :**
తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు.

మిగతాద్ది 2 లో

## తెలంగాణ యువతకు
# ఉపాధి అవకాశాల

- దారులు చూపుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామ



**హైదరాబాద్,జూన్5 :**
ప్రపంచ ఉద్యోగ విపణిలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా తెలంగాణ యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) తీర్చిదిద్దిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ వనరుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణా సంస్థలుగానే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ద్వారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు.మల్లేపల్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను మీడియా ప్రతినిధులతో కలిసి సందర్శించిన అనంతరం మంత్రి మాట్లాడారు.

2లో..



2లో..

## పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

» పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
» కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిని మంత్రి పొన్నం

**హైదరాబాద్,జూన్5 :**
ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

- ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా
- సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్,జూన్5 :**
పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

మిగతాద్ది 2 లో

## అన్నామలై రాజీనామాపై
# రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు



2 లో

**హైదరాబాద్:**
తమిళనాడు బీజేపీలో కీలక నేతగా ఎదిగి, ఆ పార్టీతో తన ప్రస్థానాన్ని ముగించుకున్న అన్నామలై వ్యవహారంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సింగ్ స్పందించారు. ప్రధానంగా అన్నామలై రాజీనామా ఆమోదంపై రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో బీజేపీకి గుర్తింపు తెచ్చిన అన్నామలై పార్టీని వీడటం దురదృష్టకరమన్నారు. ' అన్నామలై ఆరేళ్ల కింద ఐపీఎస్‌కి రాజీమానా చేసి బీజేపీలో చేరారు. ఆయన తమిళనాడు లో బీజేపీకి గుర్తింపు తెచ్చాడు. అన్నామలై పార్టీని వీడడం దురదృష్టకరం.

# మీ పదేళ్ల పాలన....
# నా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దామా

మొదటి పేజీ తరువాయి

కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పీటీసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పీటిసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు.

పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్‌ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే..

పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కెసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు.15 లక్షల రేషన్ కార్డులు అందించాం.4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కెసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన చేనేత

మొదటి పేజీ తరువాయి

నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..పోచంపల్లి నేతన్నలు అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అందుకే పోచంపల్లి 'సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించింది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు, వారి శ్రమకు తగిన ఆదాయం లభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతన్నలందరికీ అభినందనలు తెలిపారు.

ఃూదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు తమ జీవనోపాధిని ఈ రంగంపైనే ఆధారపడి కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. వారి కష్టానికి తగిన గుర్తింపు, ఉత్పత్తులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాలు వంటి భౌగోళిక గుర్తింపు (ఉఎ) పొందిన ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ చేనేత కళ, నేతన్నల అపూర్వ నైపుణ్యం, సంప్రదాయ వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందన్నారు. ఇక్కడి నేతన్నలు ఇక్కత్, డబుల్ ఇక్కత్ పద్ధతుల్లో పత్తి, పట్టు, సికో వస్త్రాలను తయారు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

మొదటి పేజీ తరువాయి

వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## అన్నామలై రాజీనామాపై రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఇలాంటి నేతలు పార్టీ వీడడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుంది. ఏ వ్యక్తి అయినా రాజీనామా ఇస్తే.. దానికి కారణం తెలుసుకోవాలి... వారిని పిలిచి మాట్లాడాలి.నాకు జరిగిందో అన్నామలై విషయంలో కూడా జరిగింది. తెలంగాణలో జరిగిన విషయాలనే కేంద్ర పెద్దలకు చెప్పాను. పెద్ద నాయకులను కలవడానికి ప్రయత్నం చేశా.. ఎవ్వరు కలవలేదు.. చివరకి పార్టీకి రాజీనామా ఇచ్చాను. కనీసం ఎందుకు రాజీనామా ఇచ్చావో అడగకుండా రాజీనామాను ఆమోదించారు. నేను బయటకి వచ్చి ఏడాది అయింది.. ఏ పార్టీ లోకి వెళ్ళలేదు.. వెళ్ళను కూడా. నాలాంటి, అన్నామలై లాంటి వాళ్ళను కాపాడాల్సిన బాధ్యత పార్టీ పై ఉంది. ఇలాంటి వాళ్ళు బాధ పడితే.. రాష్ట్ర, కేంద్ర నాయకులు పిలిచి మాట్లాడాలి' అని పేర్కొన్నారు.

## పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్ మల్కాజిగిరి చోరీ కేసులో పట్టివేత

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణెలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడిన నేపాలీ గ్యాంగ్.. లక్షల రూపాయల విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను అపహరించింది. ఈ చోరీ హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంటనే కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు.. సీసీటీవీ ఫుటేజ్‌లు, సెల్‌ఫోన్ లొకేషన్ డేటా ఆధారంగా గ్యాంగ్‌ను ట్రాక్ చేశారు. నేపాలీ ముఠా దేశంలోని వివిధ నగరాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

## పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

మొదటి పేజీ తరువాయి

అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎ÷-లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపా÷-టం÷-మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్ అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి

నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెకు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

## తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాల

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా విద్యార్థులు, ట్రైనర్లు ఏటీసీల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు.ఃూష్ట్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీలు) ఏర్పాటుకు సుమారు రూ.4,000 కోట్ల విలువైన అత్యాధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, శిక్షణా వనరులను సమకూర్చింది. టీసీల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్లు కూడా అందజేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఆధునిక నైపుణ్యాల సాధనకు అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు అనుగుణంగా శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్ పరిశ్రమల అవసరాలను తీర్చగల అత్యున్నత నైపుణ్యాలున్న మానవ వనరులు సిద్ధమవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా రాష్ట్రాన్ని దేశంలోనే నైపుణ్యాభివృద్ధి రంగంలో అగ్రగామిగా నిలబెడుతుందని అన్నారు.

ఐటీఐల మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శిక్షకులు, బోధకులకు కూడా విస్తృత స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నాణ్యమైన విద్య, ప్రాక్టికల్ శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఏటీసీలు కీలక పాత్ర పోషిస్తాయని, తెలంగాణను దేశంలో ప్రముఖ నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా నిలబెట్టడంలో ఇవి మైలురాయిగా మారతాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. సందర్భంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనతో పాటు సాంకేతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

మొదటి పేజీ తరువాయి

గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడులు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని

ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

మొదటి పేజీ తరువాయి

దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు.

సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జూన్ 06, 2026

# విక్రమార్కుని మౌనాన్ని భంగపరిచి

# చెట్టు పైకి చేరే బేతాళుడు ప్రొఫెసర్ నాగేశ్వర్

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో అభినవ బేతాళుడు మాజీ ప్రొఫెసర్ నాగేశ్వర్. చతురతతో మాట్లాడి విక్రమార్కుని మౌనాన్ని బంగపరిచి తిరిగి సేఫ్ గా చెట్టు పైకి చేరిపోయే అభినవ బేతాళుడు నాగేశ్వర్ అసలు రంగు బయట పడింది.

- **ఒరిజినల్ బేతాళ కథకు,ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నడుస్తున్న ఈ అభినవ రాజకీయ బేతాళ కథ సరిగ్గా సరిపోతుంది.**

ప్రొఫెసర్ నాగేశ్వర్ బేతాళ రూపం గురించి తెలుసుకునే ముందు విక్రమార్క బేతాళ కథల గురించి తెలుసుకుందాం.

- **శాంతిశీలుడు అనే కపట తాంత్రికుడు బేతాళున్ని ఉపయోగించుకుని రాజా విక్రమార్కుడిని బలి తీసుకోవాలనుకున్నట్లు, తెలుగు రాష్ట్రాల్లోని కపట తాంత్రిక రాజకీయుల ప్రయోజనాలు తీర్చడానికి పని చేస్తున్న అభినవ బేతాళుని శవం లాంటివాడు ప్రొఫెసర్ నాగేశ్వర్.**

బేతాళుడి శవాన్ని ఉపయోగించి క్షుద్రపూజలు చేసి, చివరకు రాజా విక్రమార్కుడిని బలి ఇచ్చి, తద్వారా అపారమైన శక్తులు సాధించి ప్రపంచాన్ని ఏలాలని ఆ తాంత్రికులు కుట్ర పన్నినట్టు ఇక్కడ తెలుగు రాష్ట్రాల ఆధునిక తాంత్రికులు, నాగేశ్వర్ ను బేతాళుడిగా ఉపయోగించుకుంటూ రాజకీయ కుట్రలు పన్నుతున్నారు.

**ఈ కథలో ఆంధ్రా విక్రమార్కుడు పవన్ కళ్యాణ్ అయితే, తెలంగాణ విక్రమార్కుడు బండి సంజయ్ అనుకోవచ్చు. అప్పుడు కపట తాంత్రికులు ఎవరో అందరికీ అర్థమై ఉంటుంది.**

బేతాళుడి సహకారం తో విక్రమార్కుడిని బలితీసుకోవాలనుకున్న కపట తాంత్రికుడు చివరికి విక్రమార్కుని చేతిలో చనిపోతాడు.
ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇదే కథ రిపీట్ అవుతుందేమో అనిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాలలోని శాంతి శీల కపట తాంత్రికులు బహుశా అంతమయ్యే సమయం వస్తుందేమో!..
బేతాళుడి లాంటి తెలివి గల ప్రొఫెసర్ నాగేశ్వర్ పవన్ కళ్యాణ్ మరియు అమిత్ షా ల మధ్యన ఒక రహస్య సమావేశం జరిగిందని ఎంతో తెలివిగా మాట్లాడుతున్నానని భ్రమించి,ఆధారం లేని ఒక వీడియో వదలి పవన్ కళ్యాణ్ మౌనం వీడేటట్టుగా చేశాడు.

**అభినవ బేతాళుడు నాగేశ్వర్ గారి వల్ల చివరకు కపట సూత్రధారుల పతనం జరుగుతుందా?...అంటే అవుననే అనుకోవాల్సి వస్తుంది**

- **అసలు ఈ బేతాళ కథల మూలం ఏమిటి**

మహాకవి సోమదేవ భట్ట క్రీస్తు పూర్వం 1 వ శతాబ్దంలో రచించిన 'బేతాళ పంచవింశతి' అనే బేతాళుని 25 కథలలో.. 25వ కథే చిట్టచివరి ముగింపు కథ.

- **మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రొఫెసర్ నాగేశ్వర్ గారు బేతాళుని లాగా,అభినవ కాలనేమి లాగా లెక్కలేనన్ని అవతారాలు ఎత్తుతుంటాడు. అతను ఎత్తని అవతారం లేదు.**

**తెలుగు రాష్ట్రాల్లో ఒక వెలుగు వెలిగిన కమ్యూనిస్టు శక్తులు ఇప్పుడు దిక్కు తోచని స్థితిలో ఉన్నాయి.రాజకీయ కార్యాచరణను మరిచిపోయిన కమ్యూనిస్టులు ఇప్పుడు ఇతరుల ఇంటి చూరు క్రింద పొద్దు గడుపుతున్నారు.**

- **ఈ కమ్యూనిస్టులకు మార్గ నిర్దేశం చేసే కాలక్షేప పాత్రను నాగేశ్వర్ గారు పోషిస్తున్నారు.**

- **తన పని తాను చేసుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశ్వసనీయతను దెబ్బతీసి కూటమి ప్రభుత్వంలో గందరగోళం సృష్టించాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ ఒక వార్తను వీడియో రూపంలో వండి వార్చాడు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని అస్థిరపరిస్తే ఎవరికి లాభం జరుగుతుంది?.. ఇది అందరికీ తెలిసిన విషయమే..వైఎస్ జగన్ కు లాభం జరుగుతుంది.**

- **నాగేశ్వర్ గారు ఏ ప్రయోజనం కొరకు అమిత్ షా ను పవన్ కళ్యాణ్ ను వీడియోలోకి లాగాడు?...నాగేశ్వర్ గారు అప్పుడప్పుడు ఇలా కాలనేమి వీడియోలను జనం పైకి వదులుతుంటాడు. తన మాటల అల్లికతో లోకాన్ని ఏమార్చుతున్నానని భ్రమల్లో బతుకుతుంటాడు.**

**తెలంగాణలో బండి సంజయ్, ఆంధ్రలో పవన్ కళ్యాణ్ లు సనాతన హైందవం పట్ల గట్టిగా మాట్లాడుతుంటే ఈ కుహనా ప్రగతిశీల,ప్రజాస్వామ్య, కమ్యూనిస్టుల, సెక్యులర్ల, ఉదారవాదుల శక్తులకు నిద్ర పట్టడం లేదు.**

- **వీళ్ళందరూ హిందూ వ్యతిరేకులు.ఈహిందూ వ్యతిరేక శక్తులకు ఒక కాంటెంట్ ఇస్తున్నాననే భ్రమలో నాగేశ్వర్ గారు అమిత్ షాను రంగంలోకి లాగాడు.**

ఆంధ్రా తెలంగాణాలో కమ్యూనిస్టుల ఉమ్మడి శత్రువులు బిజెపి, జనసేన. తెలుగుదేశం అని కూడా అనుకోవచ్చు. ఈ పార్టీల పనితీరును పలచన చేయడం కొరకు ప్రొఫెసర్ నాగేశ్వర్ తన శక్తికి మించి కష్టపడుతున్నాడు.

- **జర్నలిజం లో ప్రొఫెసర్ గా పనిచేసిన నాగేశ్వర్ గారు జర్నలిజం మౌలిక నియమాలకు, సూత్రాలకు వ్యతిరేకంగా వార్తలు రాస్తూ ఉంటాడు. అతని రాతలకు హేతువు తక్కువ,హేళన ఎక్కువ.అతని రాతల్లో ఎర్ర జీరలు తొంగి చూస్తూ ఉంటాయి. తన వార్తల్లోని సమాచారాన్ని పొందికైన పదాలతో మాట్లాడుతూ తనకు తానే సమాజ నిర్దేశకుడిగా భావించుకుంటూ ఉంటాడు**

జనం పేరుతో సోమాజి గూడ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ లు పెట్టి అసభ్య పదజాలంతో, తిట్లు శాపనార్థాలతో కాలం చెల్లిన భావజాలంతో కాలం గడిపే ఓ పదిమంది జర్నలిస్టులు తెలంగాణలో అలజడి సృష్టిస్తున్నామని ఊహల్లో ఉన్నారు.

వీరి వెంట ఓ పదిమంది కూడా రారు. ప్రజలను కదిలించే శక్తి వీళ్లకు లేదు. మీడియాలో ప్రచారం తప్ప ప్రజల్లో పలుకుబడి లేని, ప్రజల ఆదరణ లేని వ్యక్తులు తెలంగాణ ప్రశాంత వాతావరణన్ని భంగం చేస్తున్నారు.

**బేతాళుడు విక్రమార్కుని మౌనాన్ని దెబ్బతీసినట్టు పవన్ కళ్యాణ్ పనిని దెబ్బతీయదానికి కపట రాజకీయ నాయకుల లాభం కొరకు ప్రొఫెసర్ నాగేశ్వర్ పనిచేస్తున్నాడు.**



ఇద్దరు ముగ్గురు యూట్యూబ్ వార్తా హరులను, ఇంకొందరు మాజీ జర్నలిస్టులను,అర్బన్ నక్సలైట్లను వెంటేసుకుని తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చివేస్తాననే భ్రమలో ఒక చిన్న అల్లరి మూకలకు నాయకత్వం వహిస్తున్నాడు.

**ప్రొఫెసర్ నాగేశ్వర్ వాగుడు వార్తలకు మౌనాన్ని వదిలి పవన్ కళ్యాణ్ చేసిన గర్జనతో ఈ శక్తులకు వణుకు మొదలైంది.**

మొన్న తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు జూన్ 2న పవన్ కళ్యాణ్ హైదరాబాదులో ప్రెస్ మీట్ లో విసిరిన సవాళ్లతో అభినవ బేతాళుడు నాగేశ్వర్ కు గందరగోళం మొదలయ్యింది.

ప్రొఫెసర్ నాగేశ్వర్ తాను తెలివిగా లౌక్యంగా పొలిటికల్ నారేషన్ సృష్టిస్తున్నానని అనుకుంటాడు. అతని అసలు వికృత రూపం తనకు తానే బయట పెట్టుకున్నాడు. ఆయన సంగతి లోకానికి తెలిసిపోయింది.

ప్రొఫెసర్ నాగేశ్వర్ అమెరికా డీప్ స్టేట్ కుట్రలకు తెలుగు రూపం అనే ప్రచారం జరుగుతున్నది. సోరోస్ గ్యాంగ్ ఆటలకు పావు లాగా నాగేశ్వర్ గారు పని చేస్తున్నారేమోననే అనుమానం రోజు రోజుకు బలపడుతున్నదిలి.

ఒకవేళ ప్రొఫెసర్ నాగేశ్వర్ దేశ వ్యతిరేక శక్తుల కుట్రలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రతినిధిగా పని చేస్తుంటే మాత్రం, ఆ విషయం ఎప్పుడో ఒకసారి బయటపడక తప్పదు.

**ఏ పార్టీ అయినా, ఏ సిద్ధాంతం అయినా, ఏ భావజాలం అయినా ఈ దేశం ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాలి.**

అలా కాకుండా ఎంత తెలివి ప్రదర్శించి మాట్లాడినా..ఎంత కుహనా లౌక్యం ప్రదర్శించినా ఎప్పుడో ఒకప్పుడు అసలు కుట్రలోని నిజం బయటపడి తీరుతుంది.
బేతాళుని 24 కథలలో విక్రమార్కుని మౌనాన్ని పరీక్షించి.. చివరి 25వ కథలో కపట తాంత్రికుని కథ ముగిసి పోయినట్టుగా ఇప్పుడు కూడా అదే కథ పునరావృతం అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తానని ప్రగల్భాలు పలికిన ద్రావిడ పిల్లకాయ ఉదయనిధి స్టాలిన్ వల్ల ఐవీఖ దెబ్బతిన్నట్టు, పశ్చిమబెంగాల్ మమతా బెనర్జీ TMC దెబ్బతిన్నట్లు, తెలుగు రాష్ట్రాల్లో కూడా సనాతన ధర్మ వ్యతిరేక శక్తులు మట్టి కరుస్తాయి.**

ఈ ప్రకృతిలో, కాలంలో అనాదిగా మంచి చెడుల సంఘర్షణ జరుగుతూనే ఉంది. చెడు ఎంత బలంగా పనిచేసినా మంచి మాత్రమే నిలుస్తుంది,గెలుస్తుంది.
సనాతనం చెడు అయితే నశించి పోతుంది.
సనాతనం మంచిదైతే అన్ని కాల పరీక్షలకు ఎదురొడ్డి నిలుస్తుంది. చెడుపై విజయం సాధిస్తుంది. సనాతనం సత్యం కాబట్టి ఎప్పుడూ నశించదు.

నాగేశ్వర్ లాంటి వాళ్లకు సత్యం అర్థం కాకపోతే సనాతన ధర్మం అర్థం కాదు.

**సత్యాన్ని నాశనం చేయడం ఎవరి వల్లా కాదు.
ఆ సత్యమే సనాతనం..సనాతనం సత్యం**

చిలుక పలుకుల నాగేశ్వర్ లాంటి వారి మేక వన్నె అవతారాలు, తేనె పూసిన విష గుళికలు చివరికి అతని పతనానికి హేతువుగా మారతాయి.

**అలనాటి బేతాళుని వల్ల చివరికి శాంతి శీల రూపంలో ఉన్న కపట తాంత్రికుడు మరణించాడు. ఇప్పుడు ఈ బేతాళ నాగేశ్వర్ గారి వల్ల అభినవ శాంతి శీల కపట తాంత్రికులు మట్టి కరుస్తారు.**

చరిత్రలోని ఈ నీతి పునరావృతమవుతుంది.

- **రెండు తెలుగు రాష్ట్రాల్లోని కపట తాంత్రికులు ఎవరు? ఆంధ్రాలో జగన్,తెలంగాణాలో కేసీఆర్ అనే అందరి అనుమానం. ఇది నిజమా! కాదా అనేది కాలం చెబుతుంది.**

వారి వినాశనం కొరకే ప్రొఫెసర్ నాగేశ్వర్ గారిని కపట శాంతి శీలురు వాడుకుంటున్నారా?..
జరుగుతున్న పరిణామాలు ఇవేనని రాజకీయ పండితుల అంచనా వేస్తున్నారు.

**ఎవరెన్ని కుట్రలు చేసినా భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు సనాతన ధర్మానికి కూడా కచ్చితంగా వర్తిస్తాయి. ధర్మ ప్రచారం సనాతనం హక్కు.దీన్ని కాదనే వారెవరు?..**

- **సనాతన హిందూ ధర్మం హక్కులను వ్యతిరేకించేవారు కచ్చితంగా రాజ్యాంగ వ్యతిరేకులు.**

**తెలంగాణలో బండి సంజయ్, ఆంధ్రాలో పవన్ కళ్యాణ్ ల సనాతన నిష్ఠ గెలవాలని కొత్త తరం జెన్ జి కోరుకుంటున్నది.**

పశ్చిమ బెంగాల్ లో అది నిజమైంది.
తెలుగు రాష్ట్రాల్లో కూడా నిజం అవుతుంది.
హేతువాదం, నాస్తిక వాదం, సమాజవాదం పేరుతో హిందుత్వాన్ని ద్వేషించే వారు రాజ్యాంగ వ్యతిరేకులు.

- **అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారం అన్ని విశ్వాసాలకు, అన్ని భావాలకు, అన్ని మతాలకు సమాన హక్కులు ఉన్నప్పుడు, సనాతన ధర్మానికి కూడా ఆ హక్కులు ఉంటాయి.**

హేతువు లేకుండా, సత్యాసత్య విచక్షణ లేకుండా సనాతన హిందుత్వం పై దాడి చేయడం నేరం. రాజకీయ పిడివాదంతో సనాతన హిందూత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తున్న వారు అంతకంటే ఎక్కువ ప్రతిఘటన ఎదుర్కోవాల్సిందే.
సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడమే ఆధునికతగా భావించే ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉదారవాద కమ్యూనిస్టు శక్తులు నియంతల మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారు.

అటువంటి శక్తులను ప్రోత్సహించడానికి ప్రొఫెసర్ నాగేశ్వర్ రకరకాల వాదనలు తన వీడియోలతో వెదజల్లుతుంటాడు.
సనాతనం సహనశీలమైనది.
సనాతనం అత్యంత చైతన్య శీలమైనది.
సనాతనం అత్యంత ఆధునికమైనది.

- **సనాతన ధర్మ ఆచరణ చేసే వారి సహనాన్ని పరీక్షిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ కోవకు చెందిన వారు న్యూటన్ థర్డ్ లా ప్రకారం సమాన వ్యతిరేక ప్రతిచర్యను ఎదుర్కోవాల్సిందే.మార్క్స్ ప్రకారం ప్రతి అణచివేత నుండి తిరుగుబాటు ఉదయిస్తుంది. కార్ల్ మార్క్స్ ప్రకారం సనాతనం చేయబోయే తిరుగుబాటు చరిత్ర ఊహించని రీతిలో ఉంటుందేమో!**

**ఇది యుగధర్మం. ఈ తిరుగుబాటు సనాతన ధర్మం యొక్క హక్కు కూడా.**

ఇతర మతాల మాదిరిగా సనాతన ధర్మానికి ఒకే ఒక పుస్తకం ఉండదు. సనాతన హిందూత్వం ఒక జీవ నదీ ప్రవాహం..ఒక జీవన విధానం.

**గుడిలో బడిలో సనాతన ధర్మం గురించి ఎవరు బోధించనప్పటికీ,సనాతన హిందువుల ధర్మ ఆచరణ తమ వ్యక్తిగత జీవితంలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటుంది.**

విదేశీ కమ్యూనిస్ట్ సిద్ధాంత మైకంలో ఈదులాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ సనాతన ధర్మాన్ని కమ్యూనిస్టు చట్రంలో బిగించడం అసాధ్యం.

**సనాతన ధర్మం అణువు లాంటిది.**
- **అణు విచ్ఛేదనాన్ని చేయాలని ప్రయత్నిస్తే మహా విస్ఫోటనం జరుగుతుంది.**

అణుబాంబు అంటే అణు విచ్ఛేదన. సనాతన హిందూత్వాన్ని కెలుకుతున్న సనాతన హిందూ ధర్మ వ్యతిరేకులు హిందూ జన్ జి తిరుగుబాటును ఎదుర్కోవాల్సి ఉంటుంది. అణు విస్ఫోటనాన్ని అనుభవించాల్సి ఉంటుంది.
భారతదేశంలో వెయ్యిళ్లుగా సనాతన ధర్మ వ్యతిరేక కుట్ర జరుగుతూ వస్తున్నది. విదేశీ మతాలు, విదేశీ సిద్ధాంతం అయిన కమ్యూనిజం సనాతన ధర్మ విశ్వాసులను పరీక్షిస్తూనే ఉన్నారు.

**ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటి వారి విచక్షణ వివేకం ప్రశ్నార్థకమే.. వీళ్ళు వివేకం కలిగిన వారైతే సనాతన ధర్మ విశ్వాసుల శాస్త్రీయ దృక్పథాన్ని ఎప్పుడో అర్థం చేసుకొని ఉండేవారు.**

- **ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటి వారు అర్థం చేసుకున్నా.. చేసుకోకున్నా సనాతన ధర్మానికి నష్టం లేదు.**

ఎందుకంటే సనాతనం సత్యం కాబట్టి.
సత్యం నాశనం కాదు కాబట్టి.

**సత్యం వైపు నిలుచున్న వారు ఎవరైనా ఎప్పటికీ విజేతలే..**
పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంలోని తడబాట్లను దిద్దుకొని సత్య ధర్మం వైపు, సనాతన ధర్మం వైపు గట్టిగా నిలుచున్న నాడు అతడిని కదిలించడం, ఓడించడం ఎవరివల్లా కాదు..
సనాతనం నిత్య నూతనం. సనాతనం శాశ్వతం.
నిత్య నూతన సనాతనాన్ని అనుసరిస్తూ కొత్తతరం, యువతరం,సనాతన జన్ జి తరం దూసుకుపోతున్నది.

**ఇదే కాల మహిమ.**
ప్రొఫెసర్ నాగేశ్వర్ లాంటి బేతాళ మేధావుల శాంతి శీల కపట నాటకాలు ఇకపై చెల్లవు అని త్వరలోనే వారికి అర్థమవుతుంది.

## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు
## కొత్త పార్టీ పెటట్టబోతున్న అన్నామలై

- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై

తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు.
బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై
తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత
## ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం గంగా సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, వన్యప్రాణులు మన పర్యావరణ వ్యవస్థలో కీలక భాగాలని, వాటి సంరక్షణకు చెట్లు అత్యంత అవసరమని పేర్కొన్నారు. చెట్లు భూగర్భ జలాల పెరుగుదలకు, భూసార పరిరక్షణకు, వర్షపాతం ఏర్పడటానికి దోహదపడతాయని చెప్పారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడంలో చెట్లు ముఖ్యపాత్ర పోషిస్తాయని, మేఘాలు నిలిచి వర్షాలు కురిసే అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయని వివరించారు.చెట్లు కేవలం నీడను మాత్రమే కాకుండా పండ్లు, పూలు, ఔషధ గుణాలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవడం మాత్రమే కాకుండా ఆ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్న ఆయన, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు కూడా అందరూ కృషి
చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషకు విశిష్ట స్థానం ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో మాతృభాష వినియోగం తగ్గుతున్నందుకు ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు వల్ల తెలుగు ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా వెలుగొందిందని పేర్కొన్నారు. తెలుగు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశ, విదేశాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకోవాలని అన్నారు. ప్రాంతీయ అభిమానం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం, సమాజం, ప్రజలు అభివృద్ధి చెందుతారని తెలిపారు.

# ఎన్ఎంఎంఎస్-2026లో కోరపల్లి విద్యార్థిని ఘన విజయం

- స్కాలర్‌షిప్ సాధించి పాఠశాలకు కీర్తి తెచ్చిన గుడ్ల వైష్ణవి
- ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందనలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 5**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థిని జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మకమైన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)-2026 పరీక్షలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చిరంజీవి గుడ్ల వైష్ణవి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారి విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతిష్టాత్మక పరీక్ష. ఈ పరీక్షలో విజయం సాధించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. పోటీ ఎక్కువగా ఉండే ఈ పరీక్షలో కోరపల్లి పాఠశాల విద్యార్థిని విజయం సాధించడం విశేషంగా నిలిచింది.

విద్యార్థిని వైష్ణవి చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వస్తోందని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో అందించిన ప్రత్యేక శిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థిని కృషి కలిసి ఈ విజయానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక తరగతులు, మోడల్ పరీక్షలు, పోటీ పరీక్షలకు అనుగుణంగా అందించిన శిక్షణ విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరిచిందని తెలిపారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోరని వైష్ణవి నిరూపించిందన్నారు. ఆమె సాధించిన విజయం పాఠశాలలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోటీ పరీక్షల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అలాగే పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థిని విజయం వెనుక ఆమె క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వం ఉన్నాయని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటగలరని ఈ విజయం నిరూపించిందన్నారు.

విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె సాధించిన విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో కృషి చేసి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆమెను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

కోరపల్లి గ్రామ ప్రజలు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వైష్ణవిని అభినందించారు. గ్రామానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ సాధించడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామం పేరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.

ఎన్ఎంఎంఎస్-2026 ఫలితాల్లో గుడ్ల వైష్ణవి సాధించిన ఈ ఘన విజయం కోరపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలవడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచేలా ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ విజయం పాఠశాల చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిపోనుంది.

# బలమైన విద్యా పునాది నిర్మించుకోవాలి

- మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ -
కరీంనగర్ లో రెసొనెన్స్ ఫౌండేషన్ సెంటర్ ప్రారంభం




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ రేకుర్తిలోని ఓ ప్రైవేట్ హోటల్ వేదికగా ఏర్పాటు చేసిన రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ సెంటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

**ఫలితాల ఆధారిత విద్యే లక్ష్యం**

రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధన ద్వారా విద్యార్థుల్లో ప్రాథమికాంశాలను బలోపేతం చేస్తామని తెలిపారు. ఐఐటీజేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో సిద్ధం చేయడానికి ఈ ఫౌండేషన్ సెంటర్ సహాయపడుతుందని పేర్కొన్నారు. రెసోనెన్స్ విద్యాసం 2001లో రాజస్థాన్లోని కోటాలో ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ చేతస్థాపించబడిందన్నారు. గత రెండు దశాబ్దాలుగా 87 నగరాల్లో 150కి పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందన్నారు. 3.3 లక్షల మంది ఐఐటీ, ఎన్ఐఐటీ, టాప్ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు పొందారనీ తెలిపారు. 2018లో హైదరాబాద్లో ఒకే ఒక్క క్యాంపస్తో ప్రారంభమైన రెసోనెన్స్, కేవలం 7 ఏళ్లలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 50కి పైగా క్యాంపస్లతో విస్తరించిందన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతం నుండి 6,100 మందికి పైగా విద్యార్థులు ఐఐటీలు, నీట్, ఎయిమ్స్ వంటి అగ్రశ్రేణి సంస్థలలో సీట్లు సాధించారు. ప్రస్తుతం ఈ సంస్థ స్కూల్స్, ఈలెర్నింగ్, గ్లోబల్ స్టడీస్ రంగాల్లోకి కూడా విస్తరిస్తోందనీ వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50కి పైగా క్యాంపస్లతో విజయవంతంగా ముందుకెళ్తున్నామని తెలిపారు.

# భీమేశ్వర స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం తన జన్మదిన సందర్భంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా,ఆలయ సూపరిండెంట్ శ్రీనివాస్ శర్మ స్వారీ వారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు.

# ఎన్‌టిపిసిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జూన్ 5:**

పర్యావరణ సుస్థిరత, పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ సంస్థ తమ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సంఘ ప్రతినిధులు, జిఇఎం విద్యార్థినులు, కాంట్రాక్ట్ కార్మికుల చురుకైన భాగస్వామ్యంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాత ఫేరీ(పర్యావరణ అవగాహన నడక)తో ప్రారంభించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవనం, ప్రకృతిని కాపాడటంలో సామూహిక బాధ్యతపై అవగాహన కల్పించారు పర్యావరణ పరిరక్షణ, వనరుల బాధ్యతాయుత వినియోగం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, పాల్గొన్న వారందరితో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించాలనే ప్రపంచవ్యాప్త నినాదానికి అనుగుణంగా, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి స్థానిక దుకాణదారులకు వస్త్ర సంచులను పంపిణీ చేశారు. యువతలో పర్యావరణ అవగాహనను, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు, జెమ్ బాలికల్లో చిత్రలేఖన పోటీ విజేతలకు బహుమతులు కూడా పంపిణీ చేశారు. అనంతరం టౌన్‌షిప్‌లో సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సంఘ ప్రతినిధులు, జెమ్ విద్యార్థినుల భాగస్వామ్యంతో 200 మొక్కలు నాటారు. తెలంగాణ సీహెచ్పీ ప్రాంతంలో మరో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగులు, కార్మికుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో 100 మొక్కలు నాటారు. పర్యావరణ పునరుద్ధరణ పట్ల తమ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, తెలంగాణ యాష్ డైక్ వద్ద అధికారుల సమక్షంలో ఈడీ చందన్ కుమార్ సమంత చేతుల మీదుగా ఒక మియావాకి ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద, దట్టమైన మరియు స్వయం పోషక అడవులను సృష్టించడంలో ప్రసిద్ధి చెందిన మియావాకి పద్ధతిని ఉపయోగించి 1,000 మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాలలో మొత్తంగా 1,300 మొక్కలు నాటారు.

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం..

- పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత..
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 05:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్జిలు, సెషన్స్ జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో పెద్దపల్లి ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి సునీత గోదావరిఖని లోని జిల్లా కోర్టు ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మేడమ్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులు (జడ్జి) కోర్టు ప్రాంగణాలలో లేదా ప్రత్యేక క్యాంపులలో మొక్కలు నాటడం ఒక ఆనవాయితీగా వస్తోందనీ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. భూమిపై జీవకోటి మనుగడకు స్వచ్ఛమైన పర్యావరణం చాలా అవసరమని, పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం చాలా అవసరమని, అలా చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని జిల్లా జడ్జి అన్నారు. అందువల్ల చెట్లు నాటడం, పర్యావరణ సమస్యలపై అవగాహన కల్పించడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. పర్యావరణంపై ప్రభావం చూపడానికి ప్రతి వ్యక్తి తన జీవితకాలంలో కనీసం ఐదు చెట్లను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్ రెడ్డి ,1,2వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లు స్వారిక, శ్రీనిజ కోహిల్కర్ తో పాటు బార్ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజ ,బార్ అసోసియేషన్ ప్రతినిధులు గుజ్జెటి సత్యనారాయణ, కుడిది వెంకటేష్, గజ్జెల ప్రసన్న, జవ్వాజి శ్రీనివాస్, చిదురాల రమేష్, షాహనవాజ్ ఖాన్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వకులాభరణం స్వరూప రాణి
- బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు




**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వకులాభరణం స్వరూప రాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని హుజురాబాద్ పట్టణంలోని బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ స్వరూప రాణి మాట్లాడుతూ.. ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పుల కారణంగా అనేక పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకుంటే పచ్చదనాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. బ్రహ్మకుమారి సంస్థ సెంట్రల్ ఇన్‌చార్జ్ బీకే శ్రీవాణి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక విలువలు కూడా సమాజ అభివృద్ధికి అవసరమన్నారు. ప్రకృతిని ప్రేమించడం, సంరక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి రాజయ్య, నర్సింగం చౌదరి, శివరాత్రి ఈశ్వరయ్య, జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన జాడి బాల్రెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 5**

బిజెపి పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్రెడ్డి రేకుర్తి ఐ హాస్పిటల్ బైపాస్ రోడ్డు మధ్యలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి బూతులో రెండు మొక్కలు నాటే కార్యక్రమం రేకుర్తి 40 బూత్ అధ్యక్షుడు ఏం లక్ష్మి రాజ్యం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జోన్ కన్వీనర్ జాడి బాల్రెడ్డి, బిజెపి నాయకులు బుద్ధ శ్రీనివాస్ హాజరై మొక్కలు నాటారు. జాడి బాల్రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ జోన్ 60 బూతులు అధ్యక్షులు బిఎల్ఏ 2 లు వారి వారి బూతు పరిధి కాలనీలో మొక్కలు నాటారని , మొక్కలు పెంపకం వలన పర్యావరణ అన్ని



కాపాడుకుంటామని వృక్ష సంపదలో పెంపకం అన్నారు .వర్షాలు కురవడం కాలుష్యాన్ని నియంత్రణ వచ్చని అలాగే మానవులు పీల్చుకునే గాలి కాలుష్య రహితంగా ఉంటుందని అన్నారు .నరేంద్ర మోడీ పర్యావరణం పైన ప్రత్యేక దృష్టి పెట్టారని మానవుని సగటు వయసు పెంచబడుతుందని అన్నారు .కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు గోదారి నరేష్, మునవాడ రాహుల్ ,బండి రాకేష్, పరశురాములగౌడ్ ,కృష్ణమాచా,రి కొత్తపల్లి శంకర్ ,జుట్టు మమత, సుకన్య, నాంపల్లి శంకర్, పింగళి ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అసమ్మతికి కళ్లెం వేసే యత్నం

## లోక్‌సభకు పోచేసే యోచనలో మమత

తృణమూల్ కాంగ్రెస్‌కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపుర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపుర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు. మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పుర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. రైల్వేమంత్రిగానూ పనిచేశారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది.